
# పిల్లి పోయి ఎలుక వచ్చె డాం డాం డాం

## అరుణ్‌కుమార్ ఆలూరి

నా పేరు వెంకటేశం. ఓ ప్రభుత్వ కార్యాలయంలో చిరుద్యోగిని. ఈ మధ్య ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలని కూడా లెక్క చేయకుండా ఆఫీస్‌కి వెళ్లేసరికి, నాకు జ్వరమొచ్చింది. మామూలే అంటారా! నాకు మాత్రం కాదండీ! ఎందుకంటే, గత నాలుగు సంవత్సరాలుగా అలాంటివేవీ రాలేదు. అదేమిటి, దగ్గు, జలుబు, తలనొప్పి వంటిచిన్న చిన్న రోగాలు కూడా రాలేదా అంటారా? అంతటి గట్టి శరీరం నాది. కానీ ఈ జ్వరమెందుకొచ్చిందో అర్థం కావడం



లేదు. డాక్టరుగారు ఓ నాలుగు రోజులు కచ్చితంగా విశ్రాంతి తీసుకోమన్నారు. అక్కడే చిక్కొచ్చి పడింది. నా నిఘంటువులో లేని పదం విశ్రాంతి తీసుకోవడం. ఆదివారాలు కూడా ఆఫీసుకెళ్లి, సాయంత్రం దాకా ఫైళ్లు ముందేసుకుని ఆతర్వాత క్లబ్బుకి చేరి దేశ కాలమాన వైపరీత్యాల గురించి చీకటిపడే వరకూ చర్చించి ఇంటికి చేరుకోవడం నా దినచర్యే.

ఇక పండగలూ, పబ్బాలూ అంటారా...! వాటి మీద నాకంత ఆసక్తి లేదు. పెళ్లి కాకముందు వుండేది. పెళ్లయాక వాటి మీద ఆసక్తి తగ్గిపోయింది. వాటి మీదే కాదు; అన్నింటి మీదా ఆసక్తి అడుగంటిపోయింది. పిల్లలు పుట్టాక పూర్తిగా అణగారిపోయింది. ఇక పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలంటారా...! సెలవు రోజుల్లో వుంటేనే వాటికి హాజరవుతాను, లేకపోతే వాటి బాధ్యత మా శ్రీమతిదే! ఈ విషయంలో తరచు మా ఆవిడకీ, నాకూ గొడవలు జరుగుతాయనుకోండి- అది వేరే విషయం. నాతో మాట్లాడటానికి చాలా మంది భయపడతారు. కొంతమంది వితండవాదం అంటారు. ఇంకొంతమంది మొండితనం అంటారు. ఎవరేమనుకుంటే నాకేంటటా! నాకు నచ్చింది చెప్పడం, నచ్చని దాన్ని తిట్టడం మనకు జన్మతః వచ్చిన సుగుణం. దాన్ని మార్చుకోమంటే ఎలా?

***

ఈ నాలుగురోజుల విశ్రాంతిలో నాకు జ్వరం తగ్గకపోగా, కొత్తగా, తలనొప్పి కూడా అంటుకుంది. దానికో పెద్ద కథే వుంది లేండి. నాలుగు రోజులు వెనక్కి వెళ్తే....

డాక్టరుగారు నిర్బంధ విశ్రాంతిని శిక్షగా విధించడంతో, ఆ నాలుగు రోజులూ పని చేయకుండా ఎలా వుండాలా? అన్న దిగులు పట్టుకుంది. టీవీ ముందు కూర్చున్నాను. రాత్రుళ్లు ఏదైనా మంచి పౌరాణిక సినిమా వస్తే తప్ప, టీవీ ముందు కూచ్చోవడం అసలే లేదు. పెళ్లవక ముందు కూర్చునే వాణ్ణి. పెళ్లయ్యాక మా ఆవిడ టీవీ సీరియళ్లు చూడడానికే టైము చాలకపోతే, ఇంక నేనెక్కడ చూడాలి? ఆ సీరియళ్లేమో మనకి పడి చావవు.

టీవీ ముందు మోకరిల్లగానే... మా ఆవిడ రిమోట్ నా చేతికిచ్చింది. జాలిగా చూస్తూ! ఎంత చూసినా నాలుగు రోజులే కదా అన్నట్టు ఓ చూపు విసిరింది. మొదట న్యూస్ ఛానల్ పెట్టాను. 24 గంటల న్యూస్ ఛానెల్ అని మా ఆవిడ చెప్పింది. టీవీలో ఓ గ్రామాన్ని చూపిస్తున్నారు. ఆ ఛానల్ ప్రతినిధి హడావిడిగా వివరాలందించసాగింది పుల్‌స్టాపులు, కామాలూ లేకుండా! అంటే స్పీడుగా న్యూస్ సెంటర్‌లో వ్యాఖ్యాత ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. పది నిమిషాలు శ్రద్ధగా గమనించాక, అప్పుడర్థమయింది. అక్కడ రోడ్డు ప్రమాదం జరిగిందని, ఒకరికి గాయాలయ్యాయని. అయితే ఆ గాయపడిన వారెవరో నాకు కనిపించలేదు. చుట్టూ జనాలు గుమికూడారు. అంబులెన్స్ వచ్చేవరకూ ఆమె అలా వివరాలందిస్తూనే వుంది. అంబులెన్స్‌లోకి ఎక్కించేటప్పుడు కూడా ఆ వ్యక్తిని చూడలేకపోయాను.అంబులెన్స్‌ని ఫాలో చేస్తూ వెళ్లి వెళ్లి చివరికి ఆసుపత్రిలో అర్ధగంట గడిచాక, ఆ వ్యక్తిని చూపించారు. సారీ, అది వ్యక్తి కాదు జీవి. మేక. ఏడుకొండలూ కాలినడకన ఎక్కి వెంకన్నని దర్శించుకున్నంత ఆనందం కలిగింది. కాని వెంటనే దిగ్భ్రాంతి కలిగింది. కేవలం మేకకు గాయాలయ్యాయని ముప్పావుగంటసేపు సస్పెన్స్‌తో చంపారు. అసలే జ్వరంతో బాధపడుతూ, నా మానాన నేను మూలుగుతూ కూర్చుంటే, అనవసరంగా బి.పి. పెంచారు. పైగా మధ్యలో ఆ ప్రాణి బ్రతుకుతుందా; లేదా అని ఎస్.ఎం.ఎస్ చేయమన్నారు. చేతి దూల కదా, వెంటనే చేశాను. ఆ వెంటనే బాలన్స్‌లో ఓ మూడ్రూపాయలు ఫట్టన్నాయి. అదో బొక్క. అయినా మేక ప్రాణి కాదా అనిపించింది. ఎంత ప్రాణి అయినా కేవలం మేక కోసం ముప్పావుగంట విలువైన సమయాన్ని వృథా చేయడం నాకు సుతరామూ నచ్చలేదు. పాపం ఏ న్యూసూ దొరక్క ఇలా చేశారేమోలే అని జాలిపడి సరిపెట్టుకున్నాను.

ఛానల్ మార్చాను. ఇది కూడా ఇరవై నాలుగు గంటల నిరంతర ప్రసార సాధనం అట. ఇందులో పాటలు వేస్తున్నారు. ప్రేక్షకులు ఫోన్ చేసి అడిగిన పాటను ప్రసారం చేస్తారట. మా ఆవిడ చెప్పింది. ఆ న్యూస్ ఛానల్ కంటే ఈ పాటలే నయమనుకుని, అలాగే గుడ్లప్పగించి చూస్తున్నాను. ఇంతలో పాట పూర్తికాగానే ఒకావిడ ఫోన్ చేసింది. ఆవిడ హలో అనగానే, ఇక్కడ వ్యాఖ్యాత 'హలో' అన్నాడు. ఆ తర్వాత సంభాషణ ఇలా కొనసాగింది.

''హలో రాంబాబుగారు''

''ఆఁ చెప్పండి మేడం''

''గుర్తుపట్టారా అండీ''

పాపం ఈ ప్రశ్నతో సదరు వ్యాఖ్యాత గతుక్కుమన్నాడు. ఆయన గుర్తుపట్టలేదని స్పష్టంగా అర్థమవుతోంది. పచ్చి వెలక్కాయ నోట్లో పడ్డట్టు మొహం పెట్టి, నవ్వు పులుముకుని అడగసాగాడు.

''లేదు మేడమ్ గుర్తుపట్టలేదు''

''ఇంకా గుర్తుపట్టలేదా?''

'లేదండీ, ఏదైనా క్లూ ఇస్తారా కొంచెం!'

''నేను మాట్లాడినప్పుడు బయట కుక్క అరిచింది''

''ఆఁ గుర్తొచ్చింది, అపుడు మీరు పాటపాడటం మొదలు పెట్టగానే అది అరవడం స్టార్ట్ చేసింది కదా!''

'అవునండీ''


''ఎలా వున్నారండీ? ఆ కుక్కెలా వుంది? మళ్లీ అరుస్తోందా? మానేసిందా?''


''లేదండీ, అరవడం లేదు. నేను పాడటం మానేశాను''

''అయినా మీరు చాలా బాగా పాడతారండీ. ఆ రోజు దానికేదో ప్రాబ్లం వచ్చి అరిచుంటుంది. మళ్లీ ఓసారి పాడండి''

''అయ్యో! వద్దండీ''

''ఫర్వాలేదు పాడండి. మీరు చాలా బాగా






పాడుతారు''

''అయితే ఒక్క నిమిషం. కుక్కుందో లేదో చూసొస్తా''

''ఆ మాట వినగానే ఆయనగారి మొహంలో ఎక్స్‌ప్రెషన్స్ మారిపోయాయి. కోరి కోరి కొరివితో తలగోక్కోవడమంటే ఇదేనేమో! ఇంతసేపు మాట్లాడటమెందుకు? లైన్ కట్ చేసి పాట వేస్తే అయిపోతుంది కదా! అనుకున్నాను. నా భార్య నాలాగే మహా ఘటికురాలు. నా ముఖ కవళికలు ఇట్టే పట్టేసింది. నా అనుమానాన్ని నివృత్తి చేస్తూ...

''మొదట్లో పది సెకన్లకన్నా మాట్లాడే వారు కాదు. కాని ఈ మధ్య ఫోన్లు రావడం తగ్గిపోయేసరికి, ఫోన్ చేసిన వారిని మినిమం పది నిమిషాలు మాట్లాడకుండా వదిలి పెట్టట్లేదు'' అంది.

ఇంతలో అనుమానం వచ్చి అడిగాను...

''నువ్వు గానీ ఈ ఛానల్‌కి ఫోన్ చేసి సోది పెడుతున్నావా?''

''అబ్బే లేదండీ'' అంది.

ఈ మధ్య ఫోన్‌బిల్లు మోగిపోతోంది. నాకు తెలియకుండా చేసే వుంటుందిలే అనుకున్నాను. చేసినా చెబుతుందా ఏంటి నా పిచ్చి కాకపోతే.

ఇంతలో ఆవిడ రానే వచ్చింది.

''బయట కుక్క లేదండి''

''అయితే స్టార్ట్ చేయండి''

పాడటం మొదలుపెట్టింది. చిన్నప్పుడు డొక్కు రేడియోలో మంచిపాట గనుక రాకుంటే, స్టేషన్ మార్చేవాణ్ణి. అది ఓ పట్టాన కలిసేది కాదు! ఆ స్టేషన్ మార్చే క్రమంలో వచ్చే వింత శబ్దంలా వినిపిస్తోంది ఆమె గొంతు. ఇంతలో కుక్క అరుపులు వినిపించసాగాయి. కంగారుపడి అటూ ఇటూ చూశాను. అసలే కుక్కంటే చచ్చేంత భయం నాకు. ఇంతలో మా ఆవిడ ఫక్కున నవ్వి ''అది టీవీలో శబ్దం అండీ'' అంది.

మళ్లీ టీవీ వైపు చూశాను. కుక్క అరుపులు వినిపిస్తూనే వున్నాయి. ఓ ఐదు సెకన్ల తర్వాత ఈవిడ పాటపాడటం మానేసింది. ఆ వెంటనే కెవ్వున కేకేసినట్టు శబ్దం వినిపించింది. ఇక్కడ వ్యాఖ్యాత కంగారుపడిపోయి

''ఏమైంది మేడం'' అనడిగాడు.

''దొంగముండ కరిచేసిందండీ''

''ఫర్వాలేదు లెండి. దానికి మీరేం చేస్తారు. మీకు నచ్చింది కాని ఆ కుక్కకే నా గొంతు నచ్చినట్టు లేదు. ఇది వరకు ఓసారి ఇలాగే కరిచింది లెండి''

''సరేలెండి! ముందు మీరు హాస్పిటల్‌కు వెళ్లి, ఇంజక్షన్ చేయించుకోండి. మీరు కోరిన పాట వేస్తాం. మీరు చూడకపోయినందుకు బాధపడకండి. మళ్లీ రేపు ఫోన్ చేసి మీ ఆరోగ్యం ఎలా వుందో చెప్పి, మీకిష్టమైన పాట అడగండి. వుంటాను'' అని పెట్టేశాడు ఆ వ్యాఖ్యాత. ఇదేం గోలరా నాయనా అనుకుని ఛానల్ మార్చాను.

మా ఆవిడ మట్టుకు ఒకింత కోపంగానే చూస్తోంది. తను చూడబోయే ఆ దిక్కుమాలిన సీరియల్స్‌ని మిస్ అవుతున్నందుకు.

ఈ మధ్యలో మరో ఛానెల్ పెట్టి చూద్దును గదా... అందులో దాదాపు అరగంట నుంచీ వాణిజ్య ప్రకటనలు వస్తూనే వున్నాయి. ఏవేవో కొత్త కొత్త వస్తువుల గురించి చెప్తోంది. డబ్బింగ్ సినిమాలు చూశాను కానీ, డబ్బింగ్ ప్రకటనలు చూడటం మాత్రం ఇదే ప్రథమం. ఫోన్ చేసి చెప్తే చాలట. అంతాబాగానే వుంది కాని, టీవీలో అంతసేపు ఆపకుండా ప్రకటనివ్వడానికి ఎంత డబ్బు ఖర్చవుతుందో అని అనుమానం వచ్చింది. అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందా అని మరో అనుమానం. అంటే వాళ్లు మనకు అమ్మే సరుకుల మీద ఎంత లాభం తీసుకుంటున్నారో అని మరో చిన్ని అనుమానం. అలా ఆపకుండా వచ్చే ప్రకటనల్ని ఎంతమంది మాత్రం చూస్తారని ఇంకో బుల్లి అనుమానం వచ్చింది.... ఆ అనుమానాలు నివృత్తి కాకముందే మా ఆవిడ వచ్చి ఛానల్ మార్చింది. నేను నోరెళ్లబెట్టి అలా ఆ టీవీ వంకా ఇటు మా ఆవిడ వంకా చూస్తుండి పోయాను. తను పెట్టింది న్యూస్ ఛానెలే మరి. నా ఊహలో, తను అంతకుముందు ఎప్పుడూ న్యూస్ ఛానెల్‌పెట్టినట్టు లీలగా కూడా గుర్తురావడం లేదు. నోట్లో దోమలు దూరతాయని కంగారుపడినట్టుంది మా ఆవిడ. వచ్చి నా నోరుమూసింది. కొత్తగా వచ్చిన సినిమా బంపర్ హిట్ అంటూ చెప్తున్నారు టీవీలో. న్యూస్ ఛానెల్‌లో సినిమా గురించి చెప్పడమేంటో అర్థమయి చావలేదు నా మట్టి బుర్రకి. అయినా విడుదలయిన ఒక రోజులోనే సినిమా హిట్ అని ఎలా తెలుస్తుందండీ విడ్డూరం కాకపోతే! ఆ ఛానల్‌లో ప్రకటనలు చూస్తే చాలా తక్కువగా వున్నాయి. మరి ఆ వ్యాఖ్యాతలకి, విలేఖరులకి జీతాలెలా ఇస్తున్నారో అర్థమయి చావలేదు. బుర్ర వేడెక్కి పొగలు వస్తున్నట్లుగా అనిపించింది. వెంటనే కాఫీతెమ్మని కేకేసాను. జ్వరమొచ్చిందని జాలికాబోలు. ఈసారి ఆట్టే ఆలస్యం చేయకుండా అరగంటకే తీసుకొచ్చింది. తనకి నేనంటే ఎంత ప్రేమో అని మురిసిపోయాను. మురవడం పూర్తవగానే మళ్లీ టీ వీకి కళ్లప్పగించాను. హాస్పిటల్స్ ఆడ్వర్‌టైజ్‌మెంట్స్ వస్తున్నాయి. ఇదేంటి? చోద్యం కాకపోతే! ఆ రోజుల్లో ఆసుపత్రుల్ని, విద్యాలయాల్ని గుడులతో సమానంగా చూసేవారు. కేవలం వాటి పేరు ప్రఖ్యాతుల మీదే అవి నడిచేవి. అలాంటిది, మా ఆసుపత్రికే రండి బాబూ అంటూ బతిమాలుకునే హీనస్థితికి చేరుకున్నామా అనిపించింది. ఇంతలో విద్యాసంస్థల ప్రకటనలు మొదలయ్యాయి. హరి దేవుడా? అనుకుంటూండగా, ఒక ఆసుపత్రికి, ఒకపేరు మోసిన దర్శకుడు అంబాసిడర్‌గా రావడం నాకు పిచ్చెక్కి తలనొప్పి నషాళానికెక్కడం రెండూ ఒకేసారి జరిగిపోయాయి. ఇహ అలాగైతే కష్టమని టీవీ కట్టేసి, రేడియో ఆన్ చేశాను.

రేడియో ఆన్ చేయగానే మా ఆవిడ ఫక్కున నవ్వింది. ఆ నవ్వులోని అంతరార్థం తర్వాత తెలిసింది. తెలుగు, హిందీ, ఇంగ్లీషు ఏ భాషా సరిగ్గా రాని అభాగ్యులు అతికష్టమ్మీద అవస్థపడుతూ, ఆయాసపడుతూ మాట్లాడుతూన్నట్టు అనిపించింది. ఈ మధ్యే కొత్తగా ప్రారంభమైన రేడియో ఛానల్‌కి ట్యూన్ చేశాను. బయట పెద్దపెద్ద హోర్డింగులతో ప్రకటనలిచ్చారు కదా, అదైనా బాగుంటుందేమో అనుకున్నాను. ఏదో కొత్త ప్రోగ్రాం అంట. కోడలు అత్తగారి మీద ఏవిధంగా కసి తీర్చుకుందో ఫోన్ చేసి బహుచక్కగా వర్ణించి వర్ణించి చెప్పింది కోడలు. ఆ కోడలు గారు కసి తీర్చుకోవడం మీకు కరెక్ట్ అనిపిస్తే ఒకనంబర్‌కి, లేకుంటే ఇంకో నంబర్‌కి, ఏం చెప్పలేకపోతే మరో నంబర్‌కి ఎస్.ఎం.ఎస్ చేయమన్నారు. హతవిధీ! రేడియోని కనిపెట్టిన మహానుభావుడు కనక బతికుంటే, ఈ పాటికి ఉరేసుకుని చచ్చుండేవాడే అనిపించింది. గుడ్డిలో మెల్లలా రేడియో కన్నా టీవీనే మెరుగనుకుంటా. టీవీలో వాళ్లు చెప్పేదేంటో మనకు స్పష్టంగా అర్థమవుతుంది. రేడియోలో ఆ ఛాన్స్ కూడా లేదు.

డాక్టర్ గారు వచ్చి మళ్లీ నా ఆరోగ్య పరిస్థితి సమీక్షించారు. జ్వరం తగ్గకపోగా, బీపీ, తలనొప్పి, కనుగుడ్లు లాగెయ్యడం వంటిరోగాలు కూడా తోడుగా వచ్చాయని చెప్పారు. విశ్రాంతి తీసుకోవడమంటే ఒత్తిడిపెంచే బరువు పనులు ఎందుకు చేశావని చీవాట్లేసి మరో నాలుగు రోజులు కచ్చితమైన విశ్రాంతి తీసుకోమని చెప్పి చక్కాపోయారు. ఈ నాలుగురోజులూ ఏం చేయాలా అని అవిశ్రాంతంగా ఆలోచించడం మొదలెట్టింది నా బుర్ర.

★